


భగవద్గీతలో తన స్వరూపాన్ని సంశయ గ్రస్తుడైన అర్జునుడికి వివరిస్తూ, శ్రీకృష్ణ పరమాత్ములు "స్థావరాణాం హిమాలయం" అంటూ హిమనత్పర్వతాన్ని స్వీయ కృతిగా ఎరుక పరిచారు. భగవాన్ శ్రీకృష్ణుల జీవితమంతా ఔన్నత్యమహిమాలయమై విలసిల్లింది. హరివంశ పురాణంలో ఏతద్విషయ సంబంధమైన కథనం వుంది.

ఆ సమయంలో రాజుల మహారాజుల చక్రవర్తుల వెంట శ్రీకృష్ణ భగవాన్ సుధర్మ సభాస్థలిలో స్వర్గ సింహాసనం మీద విరాజిల్లుతున్నారు. వారి చుట్టూ రాజులు, మహారాజులు, చక్రవర్తులు యధోచిత ఆసనాల మీద కూచున్నారు. దేవ రాక్షసుల నడుమ సాక్షాత్ప్రజాపతి బ్రహ్మ విరాజమానుడై నట్టుగా ఆ సమయంలో సభాస్థలి విలక్షణశోభా వైభవంతో వెలిగిపోయింది.

అదే సమయంలో భీకర మేఘ గర్జనా తుల్యమైన తీవ్ర వాయునాదమయ్యింది. ప్రచండ వేగంతో గాలి జోరుగా వీచింది. భారీ వర్షం కురువబోతున్నట్టుగా ఆదినం భయంకర దుర్దినాకృతి దాల్చునున్నట్టుగా అందరికి ఆభాసితమయ్యింది. ఆ భయంకర దుర్దిన గర్భాన్ని తెంచుకుని ఆకస్మికంగా దేవర్షి నారదుల వారు అగ్ని శిఖా సదృశ సముజ్జ్వల తేజంతో రాజ్య సభా స్థలికి దిగి వొచ్చారు. వారి రాకతో ప్రబల వాయు మేఘాడంబరం శాంతించింది. సముద్ర సదృశ నృప మండలి మధ్యకు విచ్చేసిన దేవర్షి సింహాసన విరాజితులైన శ్రీకృష్ణ పరమాత్ములపై చూడ్కులు నిల్పి "హేపురుషోత్తమా వాసుదేవా దేవతల నడుమ తమరే పరమాశ్చర్య కారకులు ధన్యులు' అన్నారు. అప్పుడు శ్రీకృష్ణ పరమాత్మ "అదిసరే దక్షిణా సముపేతుడినైన నేనాశ్చర్యకరుడిని ధన్యుడిని" అన్నారు. వాసుదేవుల వాణి నాలకించుతున్న నారదుడు చేతులు మోడ్చి "ప్రభూ నా ప్రశ్నకి సమాధానం లభించింది ధన్యోస్మి. నేనిక వెళ్ళి వస్తా"నని కదిలారు. నార దుడు తిరిగి వెడుతుండగా రాజులకి అత్యంత ఆశ్చ ర్యమయ్యింది. ఏం జరిగిందో వారికి కించిన్మాత్రం కూడ అర్థం కాలేదు. ఉబలాటంతో వుండ బట్టలేక వారంతా ఏక కంఠంతో "ఈ దివ్యతత్త్వం మా అవగాహనకి అంతుపట్టలేదు. ఈ విషయం గోపనీయం కానిదైతే మాకీ రహస్యాన్ని దయచేసి విప్పి చెప్పండి" అని వాసు దేవులను ప్రార్థించారు.

అప్పుడు శ్రీకృష్ణుడు "మీరు కొంచెం ఓపిక పట్టండి ఈ రహస్యాన్ని నారదుడే స్వయంగా మీకు చెబుతారు" అంటూ ఆ రహస్యాన్ని స్పష్టం చేసి అందరికి చెప్పమని నారదుణ్ని ఆదేశించారు. అప్పుడు నారదుడు "రాజులారా! నేనేప్రకారంగా శ్రీకృష్ణుడి మహనీయేన్నత్యాన్ని తెలుసుకోగలిగానో మీకు తెలుపుతాను ఒక రోజు సూర్యోదయ సమయంలో నేను గంగా తీరంలో తిరుగుతుండగా కొండంత పెద్ద తాబేలు అక్కడికి వొచ్చింది. దాన్ని చూసి నేనాశ్చర్య చకితుడినయ్యాను. దాన్ని చేతితో నిమురుతూ "ఓ మహా కచ్ఛపా! నీ శరీర మత్యంత ఆశ్చర్యకరమైంది. వస్తుతః నీవు ధన్యుడివి. ఎందుకంటే నీవు నిశ్చింతగా నిశ్శంకగా పవిత్ర గంగా నదిలో ఈదు లాడుతూ తిరుగుతావు నీ కన్నా ధన్యులెవరు" అన్నాను. ఆ కూర్మం నా మాటలు పూర్తవక ముందే "మహా మునీ! నాలో ఆశ్చర్యకరమైంది ఏముంది? నేను ధన్యుడి నెట్లా కాగలను. ధన్యురాలీ భాగీరథీ గంగ. నా చోటి వేలాది కూర్మాలకి మకరాలకీ మత్స్యాలకే కాక సంకుల అసంఖ్యాక జీవజాలానికి ఆశ్రయ భూత శరణదాయిని. నాలాంటి అసంఖ్యాక జీవులు గంగలో వున్నారు. అందువల్లా గంగకన్నా ఆశ్చర్యకరమైన ధన్యమైన వారెవరు లేరు" అని చెప్పింది. రాజవరేణ్యులారా కచ్ఛపవాణి విని నాకు అత్యంత కుతూహలమై గంగను చేరి "సమస్త సరితాధిస్వాత్రి! దివ్యగంగామ తల్లీ! నీవత్యంత ధన్యురాలివి ఎందుకంటే నీవు తపస్వులకు ఆశ్రమాలకు రక్షణ నిస్తావు. సముద్రంలో లీనమవుతావు. సమస్తాశ్చర్య విభూషితురాలివి" అన్నాను. గంగమ్మ ఎంత మాత్రం ఆలశ్యం చేయకండా "దేవ గంధర్వ ప్రియగాన విద్యా విశారదా కలహ ప్రియనారదా నేనేమి ఆశ్చర్య విభూషితను ధన్యను ఎంత మాత్రమూ కాదు. ఈ ప్రపంచంలో సర్వాశ్చర్యకరుడు, ధన్యుడు సముద్రుడే నావంటి వందలు వేలనదులు సముద్రంలో కలిసిపోతాయి" అన్నది.

అప్పుడు నేను సముద్రం చెంతకి వెళ్ళి ప్రశంసించాను. ఆ తరుణంలో కెరటాలను చీల్చుకుంటూ పైకెగసిన సముద్రుడు "హే మహామునీ నేనెంత మాత్రం ధన్యుణ్ని కాదు. ధన్యురాలు భూదేవి. ఆమె నా వంటి అనేక సముద్రాలను ధరించి వున్నది. అందువల్ల వస్తుతః సర్వాశ్చర్యాలకూ నివాస భూమి వసుంధర" అని చెప్పాడు.

సముద్ర వచనాల నాలకించిన నేను పృథ్వీ మాతతో "సమస్త దేహధారులకు ఆశ్రయ ప్రదాత్రీ ధాత్రీ! నీవు ధన్యురాలివి సమస్తాశ్చర్యాలకి నీవే నివాస భూమివి నీవే" అన్నాను. అప్పుడు పుడమి తల్లి "ఓ సంగ్రామ కలహ ప్రియనారదా! నేను ధన్యను కాను ధన్యుడీ పర్వతం. నన్ను కూడా ధరించుతుంది కనక దీని పేరు భూధరం. ఇదే అన్ని ప్రాకారాల ఆశ్చర్యాలకు నివాస స్థలి" అన్నది. పృథ్వీ వచనాలను విని నేను భూధర సన్నిధికి చేరి "వాస్తవంగా మీరత్యంత ఆశ్చర్యమయంగా కనిపిస్తారు. సర్వ శ్రేష్ఠ స్వర్ణరత్నాది ధాతువులకు మీరే శాశ్వతాగారం అందువల్ల మీరు ధన్యులు" అన్నాను.

అప్పుడా పర్వతాలు "బ్రహ్మర్షి మేము ధన్యులం కాదు. ప్రజాపతి బ్రహ్మేధన్యుడు సర్వాశ్చర్యమయ జగన్నిర్మాత కావడం వల్ల ఆశ్చర్య స్వరూప ధన్యుడు బ్రహ్మే" అన్నాయి.

నేను బ్రహ్మదేవుల చెంతకు పోయి "కేవలం మీరే ఏకైక ధన్యులు. మీరే ఆశ్చర్యమయులు. అందరు దేవతలు రాక్షసులు మిమ్మల్నే ఉపాసిస్తారు. మీనించే సృష్టి ఉద్భవిస్తుంది అందువల్ల మీ సమలెవ్వరు" అన్నాను.

అప్పుడు బ్రహ్మదేవులు "నారదా! నీవు ఆశ్చర్య ధన్యాదిక శబ్దాలతో ఎవరిని స్తుతిస్తున్నావు. ధన్యాశ్చర్య స్థావరమీ చతుర్వేదాలే. వేదాల సహాయం వల్లనే యజ్ఞానుష్ఠానాదికాలు, విశ్వ సంరక్షణం జరుగుతుంది" అన్నారు.

ఈ రహస్య సంవాదాన్ని విన్న రాజులెంతో విస్మితులై అందరూ ఏక మాత్ర శ్రీకృష్ణ భగవానులే ధనాశ్చర్య లీలా ధారిగా సర్వోత్తమ ప్రశంసా పాత్రులుగా భావించి భక్తి పూర్ణ మనస్కులై నమస్కరించారు.

**(హరి వంశ పురాణం విష్ణు పర్వ అధ్యాయం 2020 ధన్యోపాఖ్యానం ఆధారంతో)**